నమస్తే తెలంగాణ

# మోటర్లు, మీటర్లు

**తెలంగాణ** అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఇప్పుడు మోటర్ల చుట్టూ తిరుగుతున్నది. ఎవరెన్ని చెప్పినా చివరికి నాలుగు వేళ్లు నోట్లోకి పోవాలంటే అన్నదాత చెమటోడ్చి మట్టి నుంచి పచ్చదనాన్ని పిండాల్సిందే. పంటలు పండాల్సిందే. గాదెలు నిండాల్సిందే. అప్పుడే దేశం ఆకలిని తీర్చగలం. అందుకే మన సమాజానికి కేంద్ర బిందువు రైతన్నే అంటారు ముఖ్యమంత్రి కేసీఆర్. ఆ రైతు చుట్టూ విధానాలు అల్లుకుంటూ వచ్చారు. సంక్షేమం, సుస్థిరాభివృద్ధికి బాటలు పరిచారు. *24 గంటలు నాణ్యమైన ఉచిత కరెంటుతో సాగు స్థిరీకరణకు నాంది పలికారు.* ఇది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది, ప్రశంసలూ అందుకున్నది. దేశవ్యాప్తంగా చర్చాంశమైంది. ఇది బాగోగులు తెలిసిన ఇంటిమనిషి ఆలోచన. కానీ, జాతీయ పార్టీలుగా సుదీర్ఘకాలం దేశాన్ని పాలించి అధోగతి పాలుచేసిన కాంగ్రెస్, బీజేపీ నేతలు పరాయోళ్లగానే ఆలోచిస్తున్నరు. కరెంటు మీదనే కన్నేసి రైతు బతుకు మళ్లీ ఆగమాగం చేసే కుట్రలు పన్నుతున్నరు.

*3 గంటలు, 10 హెచ్‌పీ మోటర్లంటూ కాంగ్రెస్ తన నైజాన్ని బయటపెట్టుకున్నది.* అటు బీజేపీ అసలుకే ఎసరు తెచ్చే పనిలో తలమునకలుగా ఉంది. సంస్కరణల పేరిట ఉచిత కరెంటుకు ఉరి వేసేందుకు బరి తెగించింది. మోటర్లకు మీటర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం మెడ మీద కత్తిపెట్టింది. అలా చేస్తేనే అదనపు నిధుల విడుదలకు ఒప్పుకొంటామని తెగేసి చెప్పింది. ప్రాణం పోయినా మోటర్లకు మీటర్లు పెట్టేది లేదని అంతే ధాటిగా సీఎం కేసీఆర్ ధిక్కారస్వరం వినిపించారు. ప్రతీకారంగా కేంద్రం రాష్ట్రానికి రావాల్సిన *రూ.25 వేల కోట్లు* ఆపేసింది. సంక్షేమానికి నిర్దాక్షిణ్యంగా తూట్లు పొడిచింది. ఇది సీఎం కేసీఆర్ ఎన్నికల సభల్లో ప్రజలకు పదే పదే వివరిస్తున్న మాట. ఢిల్లీకి వంగి వంగి సలాములు చేసే రాష్ట్ర బీజేపీ గులాములు కేంద్రం మీటర్లు పెట్టాలని సూచించినట్టు రుజువులు చూపమని సవాల్ విసిరారు. దీనికి జవాబు అనూహ్యంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నుంచి రావడం గమనార్హం. మీటర్లు పెట్టిన రాష్ట్రాలకు నిధులిచ్చాం, మీటర్లు పెట్టనందుకే తెలంగాణకు నిధులు నిలిపేశామని ఉన్న మాట బయటపెట్టారు. రైతుల కోసం సీఎం కేసీఆర్ ఎంతటి త్యాగాలకైనా సిద్ధమవుతారని ఆమె మాటలు చెప్పకనే చెప్తున్నాయి. నిబంధనలు, షరతులు వర్తిస్తాయన్న చందంగా మీటర్లు పెట్టకుండా ఉండే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉందని సన్నాయి నొక్కులు నొక్కారు. ఏదేమైనా సారాంశం ఒక్కటే.

రైతులు, వ్యవసాయం పట్ల బీజేపీ విధానాలు తెలియనివి కావు. కార్పొరేట్ల చేతికి కళ్లాలు అప్పగించడం వారి విధానం. మీటర్లు పెట్టడం, బిల్లులు వసూలు చేయడం, అంతిమంగా ప్రైవేటు విద్యుత్తు కంపెనీలకు అప్పనంగా లాభాలు కట్టబెట్టడం లక్ష్యం. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వాలు సాగుకు సబ్సిడీ ఇవ్వాలనుకుంటే ఆ సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లోనే వేయాలట. ఆ సబ్సిడీని కూడా గ్యాస్ బండ తరహాలో రోజు కింత తగ్గించుకుంటూ పోవాలనేది దీనంతటి వెనుక గల ఆలోచన. నల్ల చట్టాలతో సాగును సమాధి చేయతలపెట్టిన వారికీ, రైతన్నను కడుపులో పెట్టుకొని కాపాడేవారికి ఉన్న తేడా ప్రజలకు తెలుసు. ఇక్కడి ప్రజలు బీజేపీని ఆమడదూరంలో పెట్టి, బీఆర్‌ఎస్‌కు పట్టం గట్టింది, కట్టబోయేదీ అందుకే.

# కరెంటుతో.. చెలగాటమా?

> *A Small body of determined spirits fired by an unquenchable faith in their mission can alter the course of history.*
> *- Mahathma Gandhi*



శశికళ ఠాకూర్

**ఉద్యమ తెలంగాణ కన్న కలలన్నీ నిజం కావాలంటే ముందుగా కావల్సింది, అవసరమైంది అత్యంత కీలకమైంది విద్యుత్తు. 'తెలంగాణొస్తే ఏమొస్తుంది? తగినంత కరెంటు లేక చీకట్లో మగ్గిపోతుంది' అని సాక్షాత్తు సమైక్య రాష్ట్ర ముఖ్యమంత్రి కర్ర తిప్పతూ చెప్పిన మాటలు ఏ తెలంగాణ వాది మరిచిపోగలడు? తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యుత్తురంగ పునర్నిర్మాణం ఏ దశ నుంచి మొదలైందో అర్థం కావడానికి ఆ నాటి ఈ సంఘటన గుర్తు చేసుకుంటే చాలు....**



> ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మలిదశ తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులవి. ఉద్యమం పొడగునా కలలు- 'తెలంగాణొస్తే మన వ్యవసాయరంగానికి, పల్లెలకు నిరంతర సరఫరా అందిం చవచ్చు, భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులను నిర్మించుకొని గోదావరి, కృష్ణా నీళ్లను రాష్ట్రం నలుచెరుగులా పారించి పాడి పంటలతో పచ్చగా మెరిసిపోయే తెలంగాణను సాకారం చేసుకోవచ్చు. మన పరిశ్రమలకు అంతరాయాల్లేని నాణ్యమైన, నిరంతర విద్యుత్తును అందించి తెలంగాణను పరిశ్రమల పెట్టుబడులకు చిరునామాగా రూపొందించవచ్చు.

తెలంగాణ ప్రజలు కలలుగన్న బంగారు తెలంగాణ సాకారం కావాలంటే ముందుగా దృష్టిపెట్టి అభివృద్ధి చేయవలసింది విద్యుత్తురంగమే అన్న అవగాహన ఉన్న దార్శనికుడు, ఉద్యమనాయకునిగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండటం మన అదృష్టం. అందుకే విద్యుత్తురంగ అభివృద్ధికి తొలి ప్రాధాన్యాన్ని ఇచ్చి విస్తృత మేధోమథనం జరిపారు. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ, రంగాలకు వేలాది కోట్ల రూపాయల నిధులను వెచ్చించి అప్పటికే అందుబాటులో ఉన్న సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తే తప్ప నిరంతర విద్యుత్తు సాధ్యపడలేదు. దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా విద్యుత్తు రంగాన్ని అభివృద్ధి చేసుకోవడం వల్లనే వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్తు సాధ్యపడింది.

మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో కూడా ఇప్పటికీ అక్కడి ప్రభుత్వాలు రైతులకు పగటిపూట ఏడు గంటల కరెంటు అందించడానికి ఆపసోపాలు పడుతున్నాయి. గుజరాత్‌లో చేపట్టిన 'సూర్యోదయ కిసాన్ యోజన' పథకం ఇప్పటికీ సాకారం కాలేదు. దేశంలోనే అత్యధిక జీడీపీ కలిగిన మహారాష్ట్రలోని రైతుల కష్టాలు అందరికీ తెలిసినవే. తరచూ రైతు ఆత్మహత్యలతో అల్లాడిపోతున్నది. దేశంలోని మరే రాష్ట్రం సాధించని అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్తు ఎలా సాధ్యపడిందో ఉత్పత్తి, సరఫరా, పంపిణీ రంగాలవారీగా కింద పేర్కొన్న ప్రగతి పట్టికను ఒకసారి విశ్లేషించుకుంటే అర్థమవుతుంది.

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వ్యవసాయ రంగానికి విద్యుత్తు ప్రధాన చర్చనీయాంశమైంది. ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన నాయకులు ఒకరు వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని, రైతులు 10 హెచ్‌పీ మోటర్లు వాడుకుంటే చిన్న చిన్న కమతాలుగా ఉన్న చిన్న, సన్నకారు రైతులకు మూడు గంటల కరెంటు కంటే ఎక్కువ అవసరం ఉండదనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ల సామర్థ్యం పెంచుకోవడం, కొత్త 11 కేవీ ఫీడర్ల నిర్మాణం ఇత్యాది పనులను పెద్ద ఎత్తున చేయడం జరిగింది. చెప్పొచ్చేదేమంటే ఇప్పుడు ఉన్నఫళంగా 5 హెచ్‌పీ మోటర్ల స్థానంలో 10 హెచ్‌పీ మోటర్లను బిగించవలసి వస్తే ఎలాంటి సాంకేతిక, ఆర్థిక సమస్యలు ఉత్పన్నమవుతాయో చర్చించుకుందాం.

27 లక్షల 48 వేల వ్యవసాయ పంపుసెట్ల సామర్థ్యం 5 హెచ్‌పీతో లెక్కించినప్పుడు 11 వేల మెగావాట్లుగా ఉంటుంది. 10 హెచ్‌పీ మోటర్లుగా మార్చినట్లయితే 22 వేల మెగావాట్లు డిమాండు సరఫరా చేయాలి. ఇప్పటివరకు అన్నిరంగాలు కలిపి మన రాష్ట్ర పీక్ 15,497 మెగావాట్లుగా నమోదైంది. మరి 22 వేల మెగావాట్లు వ్యవసాయరంగ లోడ్ అయినప్పుడు ఆ మేరకు ఉత్పత్తి, పంపిణీ సరఫరా రంగాల సామర్థ్యాన్ని పెంచుకోవడం సాధ్యమయ్యే పనేనా? అందుకవసరమైన సుమారు 50 వేల కోట్ల భారీ నిధుల సేకరణ చేసుకునే వెసులుబాటు ఉంటుందా? మార్కెట్లో 10 హెచ్‌పీ మోటర్ పంపు ఖరీదు సుమారు 70 వేలుగా ఉన్నది. 27 లక్షల 48 వేల పంపుసెట్లను మార్చడానికి అవసరమైన సుమారు రూ.18,900 కోట్లను ఎలా సమకూర్చుకుంటారు?

విద్యుత్తు ఉత్పత్తిని పెంచుకోవడం ఉన్నపలంగా సాధ్యం కాదు. ఏండ్ల తరబడి కొనసాగే ప్రక్రియ ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తికి 6-7 కోట్ల రూపాయలు అవసరం ఉంటుంది. 400 కేవీ, 220, 132 కేవీ, 33/11 కేవీ సబ్-స్టేషన్ల సామర్థ్యం రెట్టింపు చేసుకోవాల్సి ఉంటుంది. సబ్‌స్టేషన్ల నుంచి వచ్చే 11 కేవీ ఫీడర్ల సామర్థ్యం సరిపోదు కాబట్టి నూతనంగా ఇప్పుడున్న సంఖ్యకు ఇంచుమించు సమానస్థాయిలో నూతనంగా 11 కేవీ ఫీడర్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకోవాలి. అంటే 100 కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో మరొక 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అయినా పెట్టాలి లేదా దానిస్థాయిలో 200 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌నైనా పెట్టాలి. వ్యవసాయరంగానికే సుమారు 4 లక్షలకు పైగా వివిధ కెపాసిటీలకు చెందిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లున్నాయి మన రాష్ట్రంలో. రైతులు కూడా స్టార్టర్లు, వైర్లు అన్నీ మార్చుకోవాల్సి ఉంటుంది. నిరంతర కరెంటు అందుబాటులో ఉండటం వల్ల రైతులకు లో ఓల్టేజీ సమస్య లేదు. అవసరం ఉన్నప్పుడు వాడుకుంటారు. అలా కాకుండా నిర్ణీత సమయంలోనే కరెంటు ఇచ్చినట్టయితే మోటర్లన్నీ ఒక్కసారే స్టార్ట్ అవుతాయి. ఎందుకంటే రైతులందరూ ఆటోమేటిక్ స్టార్టర్లు అమర్చుకుంటారు. దాని వల్ల గ్రిడ్‌పై ఒక్కసారిగా భారం పడుతుంది. మొదటిలాగే తరచుగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, వైర్లు తెగిపోవడం, ఫ్యూజులు ఎగిరిపోవడం లాంటి సమస్యలు షరామామూలే.

కేంద్రం తీసుకురానున్న విద్యుత్తు సవరణ బిల్లు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వద్ద పరిశీలనలో ఉన్నది. ఒక్కసారి చట్టం అమలుకు నోచుకున్నట్టయితే వ్యవసాయరంగం పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉన్నది. దేశంలోని 29 రాష్ట్రాల్లో దేశంలోని మరే రాష్ట్ర రైతాంగానికి ఉచిత విద్యుత్తు నిరంతరాయంగా 24 గంటలు అందించడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ అనంతరం సాధించిన అద్భుత విజయాల్లో విద్యుత్తు రంగం ముఖ్యమైనదనే విషయం అంగీకరించాల్సిన చరిత్ర.

> **హెచ్‌వీడీఎస్ హై ఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ ఓల్టేజీ సిస్టంలో భాగంగా రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ సహకారంతో వ్యవసాయరంగానికి 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి ఐదేసి బోర్లకు కరెంటు ఇవ్వడం జరుగుతున్నది. 5 హెచ్‌పీ x ఐదు బోర్లు అంటే 25 కేవీఏ అన్నమాట.**
>
> **మరి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాల్సి వస్తే 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను 50 కేవీఏకి పెంచాలి. లేదా అదనంగా 25 కేవీఏ మరొకటి. ట్రాన్స్ ఫార్మర్‌ను బిగించాలి. అత్యంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.**

> **10 హెచ్‌పీ మోటర్ 3 గంటలు పనిచేస్తే చాలనుకుందాం. ప్రస్తుతం ఉన్న 5 హెచ్‌పీ మోటర్లకు 2014కు పూర్వం 6 గంటల కరెంటును ఇచ్చారు కదా? మరి అలాంటప్పుడు కరెంటు కోతలు, పంటలు ఎండిపోవడం, మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం లాంటి సమస్యలు ఎందుకున్నట్టు? 10 హెచ్‌పీతో మూడు గంటల కరెంటు సరిపోయినప్పుడు 5 హెచ్‌పీతో ఆరు గంటల కరెంటు ఎందుకు సరిపోలేదో చెప్పాలి?**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు వ్యవసాయరంగానికి 6 గంటల కరెంటు రెండు, మూడు విడతలుగా ఇచ్చేవారు. దాని పరిణామాలు పంట నష్టాలు, రైతు ఆత్మహత్యలు, సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు, రాస్తారోకోలు, కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు.. ఇవన్నీ పచ్చిగా కండ్ల ముందు కదలాడే మరిచిపోలేని దృశ్యాలు, అనుభవాలు.

ప్రస్తుతం రాష్ట్రంలో 27 లక్షల 48 వేల వ్యవసాయ పంపుసెట్ల ద్వారా రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. రాష్ట్ర విద్యుత్తు వినియోగంలో సుమారు 31 శాతానికి పైగా వ్యవసాయరంగానికే పోతున్నది. రైతులకు ఉచితంగా కరెంటును అందించడం జరుగుతున్నది. 95 శాతానికి పైగా రైతులు 5 హెచ్‌పీ మోటర్లను వాడుతారు. ఎక్కడో ఒకచోట 7.5 హెచ్‌పీ మోటర్లు అతి తక్కువగా ఉపయోగిస్తారు. మనకున్న భూగర్భ జలాల లభ్యత రీత్యా 5 హెచ్‌పీ మోటర్లనే రైతులు వినియోగిస్తున్నారు. ఒక హెచ్‌పీ 745 వాట్లకు సమానం. అంటే 5 హెచ్‌పీ మోటర్ 3.725 కిలోవాట్లకు సమానమన్న మాట- ఈ లెక్కన రైతులు ఉపయోగిస్తున్న పంపు మోటర్ల సామర్థ్యం 11,000 మెగావాట్లు- అంటే గంటకు ఒక కోటి పది లక్షల యూనిట్ల విద్యుత్తు వినియోగం- గతంలో విడతల వారీగా వ్యవసాయరంగానికి ఇచ్చేవారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే రైతులు పగలు తొమ్మిది గంటలు కరెంటు ఇవ్వడానికి అప్పటికే అందుబాటులో సబ్‌స్టేషన్లు లైన్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకోవాల్సి వచ్చింది. అందుకుగాను సుమారు 30 వేల కోట్ల రూపాయలు వెచ్చించి అదనంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, పవర్

| విద్యుత్తు ప్రగతి | 2.6.2014 నాటికి | 1.8.2023 నాడు | ప్రగతి |
|---|---|---|---|
| ఉత్పత్తి సామర్థ్యం | 7,778 మె.వా. | 18,756 మె.వా. | 10,978 మె.వా. |
| గరిష్ఠ డిమాండ్ | 6,666 మె.వా. | 15,497 | 9,836 మె.వా. |
| గరిష్ఠ దినసరి వినియోగం | 124 మి.యూ. | 298 మి.యూ. | 169 మి.యూ. |
| తలసరి వినియోగం | 1,196 యూనిట్లు | 2,140 యూనిట్లు | 944 యూనిట్లు |

| ట్రాన్స్‌కో సబ్-స్టేషన్లు | 2.6.2014 నాటికి | 1.5.2023 నాడు | ప్రగతి |
|---|---|---|---|
| 400 కేవీ సబ్ స్టేషన్లు | 6 | 30 | 24 |
| 220 కేవీ సబ్‌స్టేషన్ల | 51 | 103 | 52 |
| 132 కేవీ సబ్‌స్టేషన్లు | 176 | 251 | 75 |
| మొత్తం | 233 | 384 | 151 |
| ఈహెచ్‌టీ లైన్లు | 16,379 కి.మీ. | 28,131 కి.మీ. | 11,752 కి.మీ. |
| సామర్థ్యం (ఎంవీఏ) | 14,973 కి.మీ. | 38.941 కి.మీ. | 23,968 కి.మీ. |

| డిస్కంల ప్రగతి | 2.6.2014 నాటికి | 1.5.2023 నాడు | ప్రగతి |
|---|---|---|---|
| 33 కేవీ సబ్‌స్టేషన్లు | 2,138 | 3,210 | 1,070 |
| పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు | 3,272 | 5,691 | 2,419 |
| డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు | 4,61,937 | 8,60,239 | 3,98,302 |
| వ్యవసాయ వినియోగదారులు | 19,03,000 | 27,02,491 | 8,46,000 |


# కుర్చీలాటే కాంగ్రెస్ గ్యారెంటీ

> స్వాతంత్య్రానంతరం ఉమ్మడి ఏపీ మొదలు తెలంగాణ రాష్ట్రం వచ్చేదాన్క కాంగ్రెస్ పాలనలో మన ముఖ్యమంత్రుల జాబితా పరిశీలిస్తే... ఎక్కువ శాతం మందికి పదవీకాలం ముగియకముందే అధిష్ఠానం ఉద్వాసన చెప్పడం గమనించదగిన అంశం.

**అంతేకాదు, ప్రతి ముఖ్యమంత్రి ఏదో ఒక ఆరోపణతో/ అవినీతి పనులతో/ అసమ్మతి పోరుతో పదవిని కోల్పోయినట్టు కూడా తెలుస్తున్నది. అంటే కాంగీ అధిష్ఠానానికి ముఖ్యమంత్రులను మాటిమాటికి మార్చే గుణం జాతి లక్షణంగా అలవడిందని తెలుస్తున్నది.**



డాక్టర్ వి.వి.రామారావు
98492 37663



ముఖ్యమంత్రులను మార్చడం వల్ల ప్రజా పాలన సాఫీగా సాగదు. అభివృద్ధి కుంటు పడుతుంది. ఏదో ఒక అత్యవసర పరిస్థితిలో ముఖ్యమంత్రిని మార్చితే తప్పేమీ లేదు. సరైన కారణం ఉంటే మార్పును ప్రజలు కూడా స్వాగతిస్తారు. కానీ కాంగీ వారు మాత్రం ముఖ్యమంత్రుల మార్పును ఒక క్రీడగా చేయడం బాధాకరం. ఈ విధమైన వైఖరి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రతి రాష్ట్రంలోను ఉన్నట్టు చరిత్ర చెప్తున్నది.

ఉమ్మడి ఏపీలో కాసు బ్రహ్మానందరెడ్డి, జలగం వెంగళరావు మినహా ఏ ఒక్కరు ఐదేండ్లు స్థిరపాలన అందివ్వలేదు. ఉమ్మడి ఏపీకి తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి కర్నూలు జిల్లాలోని బస్సు రూట్లను జాతీయాకరణ చేశారు. అప్పుడు సుప్రీంకోర్టు వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందువల్ల సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. తదుపరి దళిత వర్గానికి చెందిన దామోదరం సంజీవయ్యను 1960 జనవరిలో రాష్ట్రానికి తీసుకువచ్చారు. కులం/ ముఠా రాజకీయాల మధ్య ఆయనకు ఊపిరి సలపకుండా చేశారు. బలీయమైన రెడ్డి వర్గం కలిగిన ఏసీ సుబ్బారెడ్డి మరీ తలబిరుసుతనంతో కులం పేరు ఎత్తి సంజీవయ్యను హేళన చేశాడు కూడా.

> 1964 నుంచి కాసు బ్రహ్మానందరెడ్డి ఏకంగా ఏడేండ్లు పాలించాడు. ఆయన వైఖరి వల్లనే 1969లో ప్రత్యేక తెలంగాణ కోసం ప్రజలు ఉప్పెనలా ఉద్యమించారు. ఉద్యమాన్ని నీరుగార్చాలని, ఇందిరమ్మ తెలంగాణకు చెందిన సౌమ్యుడు పీవీతో అంతగా అపాయం లేదనుకొని 1971లో ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. అప్పటికే స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 25 ఏండ్లయింది. భూస్వామ్య వ్యవస్థ బలపడి పేదలకు గుంట భూమి కూడా లేని దీనస్థితిని చూసిన పీవీ, భూ సంస్కరణలు ప్రవేశపెట్టి సంచలనం సృష్టించడమే కాదు, భూస్వాముల గుండెల్లో ప్రకంపనాలు కలిగించారు.

పీవీ 'వామనుడ'నుకుంటే త్రివిక్రమావతారం ఎత్తాడని తస్మదీయులకు చెమటలు పట్టాయి. మెత్తనివాడనుకొన్న పీవీ ఇందిరా కాంగ్రెస్ నాయకుల పాలిట ముల్లులా తయారయ్యారు. అది మింగుడు పడని ఇందిరమ్మ 'జై ఆంధ్ర' ఉద్యమాన్ని సాకుగా తీసుకున్నది. పీవీ చేత రాజీనామా చేయించి రాష్ట్రపతి పాలన విధించింది. తర్వాత 1973లో జలగం వెంగళరావుకు పట్టం గట్టింది. 1975లో దేశంలో విధించిన ఎమర్జెన్సీ పుణ్యమాని జలగంపై ఎలాంటి వేటు పడలేదు. 1978లో మళ్లీ చెన్నారెడ్డి పగ్గాలందుకున్నాడు. కానీ, ఆయన షష్టిపూర్తి ఉత్సవం చందారెడ్డిని చేసింది. షికాయత్‌లు వినే సంస్కారం ఉన్న ఇందిర, అంగూఠా ఛాప్ (వేలి ముద్రలు వేసేవాడు, నిరక్షరాస్యుడు) అంజయ్యను 1980లో ముఖ్యమంత్రిగా అందలమెక్కించింది. నిజానికి ఆయన కూడా రెడ్డివర్గం వాడే. ఆయన అసలు పేరు రామకృష్ణారెడ్డి. తండ్రి పేరు పాపిరెడ్డి. ఆయన దళితుడని, బీసీనని చెప్పుకొనేవాడు. అమాయకత్వంతో అడిగినవాడి కల్ల మంత్రి పదవి ఇచ్చి అరవై పైచిలుకు సభ్యులతో మంత్రి వర్గాన్ని నిర్మించి అంజయ్య క్యాబినెట్ అనే సామెత పుట్టడానికి కారణమయ్యాడు. సరే తర్వాతేమైంది? 16 నెలలకే అంజయ్యకు ఉద్వాసన చెప్పింది. 1982లో భవనం వెంకట్రాంరెడ్డిని కుర్చీలో కూర్చుండబెట్టింది. 7 నెలలు తిరక్కుండానే పదవీచ్యుతుడిని చేశారు. తదుపరి ఎవరైతే చెప్పు చేతల్లో ఉంటారని ఆలోచించగా కోట్ల విజయభాస్కరరెడ్డి కనిపించాడు. ఇలాంటి వారైతేనే బెటర్ అనుకొని ఆయనను కుర్చీలో కూర్చుండబెట్టింది. ఈ మ్యూజికల్ చైర్ పోటీలు చూడలేక ప్రజలే గంట కట్టి ఎన్టీఆర్‌కు జైకొట్టారు. కాంగ్రెస్‌పై విముఖతే తెలుగుదేశాన్ని గెలిపించింది.

1989లో మళ్లీ చెన్నారెడ్డికి సింహాసనం ఇచ్చిన అధిష్ఠానం 12 నెలలకే హైదరాబాద్‌లో చెలరేగిన మతకల్లోలాల సాకుతో ఆయనను తొలగించి నేదురుమల్లి జనార్దనరెడ్డికి పట్టంగట్టింది. నేదురుమల్లి 1992 జూన్‌లో సీటుకు ఐదు లక్షల చొప్పున కాపిటేషన్ ఫీజు వసూలు చేసుకునే ప్రైవేటు యాజమాన్యంలోని 20 ఇంజినీరింగు, వైద్య కళాశాలలకు పర్మిట్లు ఇవ్వాలని నిర్ణయించాడు. ఈ విధంగా కళాశాలలను స్థాపించడానికి పర్మిట్లు పొందిన అనేక సంస్థలు సారా వ్యాపారులు, ఎక్సైజ్ కాంట్రాక్టర్లు, మంత్రులు పెట్టుబడి పెట్టినవే. వీటికి అనుమతులు మంజూరు చేయడానికి జనార్దనరెడ్డి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలుచేశాడని అధిష్ఠానం ఆగ్రహించి జ(ధ)నార్జన రెడ్డిని పదవి నుంచి తొలగించి మళ్లీ కోట్ల విజయభాస్కరరెడ్డినే నియమిం చింది. 1982లో మాదిరి ఆయన ఉక్కుపాదం ఎన్టీఆర్‌కు గోల్డెన్ లెగ్ అయింది. కాంగీయుల తగవులాటను చూసి విసిగిన తెలుగు ఓటర్లు మళ్లీ ఎన్టీఆర్‌కే పట్టంగట్టారు.

1999లో సోనియమ్మ అస్మదీయుడని (ఇద్దరిదీ ఒకే మతం) భావించి మళ్లీ రెడ్డి గ్రూప్‌కు చెందిన వైఎస్ రాజశేఖరరెడ్డికే పగ్గాలిచ్చింది. అఫ్‌కోర్స్ వైఎస్‌ఆర్ 1470 కిలోమీటర్ల పాదయాత్ర కూడా ఆయన ముఖ్యమంత్రి పదవికి మార్గం వేసింది. ఉచిత విద్యుత్తు హామీ ప్రజలను ఊరించింది. శివరాత్రి నాడు భోజనానికి పిలిచినట్టు... అసలు విద్యుత్తు ఉత్పాదనే లేనప్పుడు ఉచిత విద్యుత్తు పథకం నేతీ బీరకాయ వంటిదే కదా! తెలంగాణ రాష్ట్రం అవతరించగానే సీఎం కేసీఆర్ తొలుత ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసి తర్వాత భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్లు నెలకొల్పారు. విద్యుత్తు ఉత్పాదన పెంచడమే కాదు, కార్యనిర్వహణాదక్షుడని కేసీఆర్ నిరూపించుకున్నారు.

వైఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతిపై ఆయన మంత్రివర్గ సభ్యులే కాకుండా కేంద్రమంత్రులు, ప్రస్తుత మంత్రులు, ప్రధాన ప్రతిపక్ష నేతలు విమర్శలు గుప్పించారు. రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మైసూరారెడ్డి లెక్కలు వేయగా అప్పటి మంత్రి పి.శంకర్రావు వ్యాఖ్యలను కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. వైఎస్‌ఆర్ హయాంలో అవినీతి జరిగిందని సీబీఐ ప్రాథమిక విచారణలో వెల్లడించింది. క్విడ్ ప్రో కో రూపంలో వైఎస్ జగన్‌కు చెందిన కంపెనీలలో పెట్టుబడులు వచ్చినట్టు సీబీఐ చార్జిషీటులో పేర్కొన్నది.

వైఎస్ మరణం తర్వాత రోశయ్యది మూన్నాళ్ల ముచ్చటే అయింది. ఆయన తర్వాత కిరణ్‌కుమార్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టా రు. ఈ విధంగా నీలం సంజీవరెడ్డి మొదలు కిరణ్‌కుమార్ రెడ్డి వరకు ఎక్కువ శాతం అవినీతి ఆరోపణలతోనో అసమ్మతి వర్గాల ఒత్తిడితోనో కొందరు నెలల్లో, కొందరు ఏడాదిలో పదవిని వదులుకున్నారు. ఉదాహరణకు 1978 అసెంబ్లీ ఎన్నికల తర్వాత నాలుగేండ్ల పాలనలోనే చెన్నారెడ్డి, అంజయ్య, భవనం వెంకట్రాం, కోట్ల విజయభాస్కర్‌రెడ్డిలతో కలుపుకొని నలుగురు ముఖ్యమంత్రులు మారారు. 1989-92 మధ్య మూడేండ్లలో ముగ్గురు, 2009-13 మధ్య మూడేండ్లలో ముగ్గురు మారారు. దీన్నిబట్టి కాంగీయులది ఆరు సూత్రాల పథకం కాకుండా ఆరుగురు ముఖ్యమంత్రుల మార్పిడి పథకమని తెలియవస్తున్నది! ఇది వ్యంగ్య విశ్లేషణ కాదు.. చరిత్ర చెప్పిన సత్యానికి అక్షర రూపం!

